## క్లుప్తంగా

### నేడు భూభారతిపై అవగాహన

**కౌటాల:** మండల కేంద్రంలోని రైతువేదికలో భూభారతి చట్టంపై శుక్రవారం మధ్యాహ్నం 2 గంటలకు అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు మండల వ్యవసాయాధికారి ప్రేమలత గురువారం తెలిపారు. సదస్సులో జిల్లా ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు హాజరు కానున్నట్లు పేర్కొన్నారు. మండలంలోని వివిధ గ్రామాల రైతులు, ప్రజాప్రతినిధులు సకాలంలో హాజరు కావాలని కోరారు.

**రెబ్బెన:** మండల కేంద్రంలోని రైతువేదికలో శనివారం మధ్యాహ్నం 2 గంటలకు భూభారతి చట్టంపై అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు తహసీల్దార్ రామ్మోహన్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. సదస్సుకు జిల్లా కలెక్టర్ వెంకటేశ్ దోత్రే, అడిషనల్ కలెక్టర్ (రెవెన్యూ) డేవిడ్‌తో పాటు ఆర్డీవో లోకేశ్వర్‌లు హాజరు కానున్నట్లు పేర్కొన్నారు.

### నేడు జీఎం కార్యాలయం ఎదుట ధర్నా

**రెబ్బెన:** టీబీజీకేఎస్ సెంట్రల్ కమిటీ నిర్ణయం మేరకు సింగరేణిలో నెలకొన్న మంచినీటి సమస్య, వైద్య సౌకర్యం మెరుగుపర్చడంతో పాటు నూతన గనులను ప్రారంభించాలనే డిమాండ్లతో గోలేటి టౌన్‌షిప్‌లోని జీఎం కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించనున్నట్లు ఆసంఘం ఏరియా ఉపాధ్యక్షుడ మల్రాజు శ్రీనివాస్‌రావు తెలిపారు. సింగరేణి యాజమాన్యం బొగ్గు బ్లాకుల వేలం పాటలో పాల్గొనకుండా కేంద్ర ప్రభుత్వమే తెలంగాణలోని బొగ్గు బ్లాకులను నామినేషన్ పద్ధతిలో సింగరేణికి కేటాయించాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. ఏరియాలోని గోలేటి ఓసీపీని త్వరగా ప్రారంభించాలని కోరారు. అనంతరం జీఎంకు డిమాండ్లతో కూడిన వినతిపత్రం అందజేశారు.

### నేడు సమీక్షా సమావేశం

**కెరమెరి:** మండల కేంద్రంలోని మండల సమాఖ్య కార్యాలయంలో శుక్రవారం ఉదయం 10:30 గంటలకు సమీక్షా సమావేశం నిర్వహించన్నుట్లు ఐకేపీ ఏపీఎం జగదీశ్వర్ ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి సీసీలు, వీవోఏలు సకాలంలో హాజరు కావాలని కోరా రు.

### నేడు ఇసుక వేలం

**ఆదిలాబాద్‌టౌన్(జైనథ్):** భోరజ్ మండలంలోని పెండల్‌వాడ, డొల్లార గ్రామంలో అక్రమంగా నిల్వ ఉంచిన ఇసుక ఇటీవల సీజ్ చేయడం జరిగిందని భోరజ్ తహసీల్దార్ రాజేశ్వరి ఒక ప్రకటనలో తెలిపారు. భోరజ్ మండల తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం ఉదయం 11.30 గంటలకు బహిరంగ వేలం పాట నిర్వహించడం జరుగుతుందని పేర్కొన్నారు. ఆసక్తిగల వారు బహిరంగ వేలంలో పాల్గొనవచ్చని తెలిపారు.

### పుస్తెమట్టెలు అందజేత

**ఖానాపూర్:** మండలంలోని గోడలపంపు ఎస్సీ కాలనీకి చెందిన కొత్తూరు లక్ష్మి-నర్సయ్య దంపతులకు నలుగురు కూతుళ్లు ఉన్నారు. వచ్చేనెలలో రెండో కూతురు మానస వివాహం జరగనుంది. యువతి తండ్రి అనారోగ్యంతో బాధపడుతున్నాడు. నిరుపేద కుటుంబం కావడంతో పట్టణానికి చెందిన ఓకేఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు ఒడ్డెపల్లి అనుజ్ఞ-కృష్ణంరాజు దంపతులు గురువారం యువతికి పుస్తెమట్టెల తోపాటుచీర అందజేశారు. ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

### నేడు జాబ్‌మేళా

**సిరికొండ:** మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాల్లో నేడు యువతీ, యువకులకు ప్రతిభ ఫౌండేషన్ సంస్థ సహకారంతో సిరికొండ ఆర్‌ఎంపీ వైద్యుల ఆధ్వర్యంలో శుక్రవారం జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు ఆర్‌ఎంపీ అసోసియేషన్ సభ్యులు తెలిపారు. 18 సంవత్సరాలు నిండిన యువతీ, యువకులకు వివిధ కోర్సుల్లో శిక్షణతో కూడిన ఉద్యోగం కల్పన ఉంటుందన్నారు.

### అర్హులనే గుర్తించాలి

**ఖానాపూర్:** ఇందిరమ్మ ఇళ్ల పథకంలో అర్హులైన లబ్ధిదారులను గుర్తించాలని జెడ్పీ సీఈవో గోవింద్ అన్నారు. మండలంలోని దిలావర్‌పూర్‌లో ఇందిరమ్మ ఇళ్ల కమిటీ సభ్యులతో గురువారం జరిగిన సమావేశంలో పాల్గొన్నారు. ఎలాంటి పక్షపాతి లేకుండా ఎంపిక చేయాలన్నారు. ఎంపీడీవో సునీత, ఎంపీవో రత్నాకర్‌రావు, గ్రామస్తులు ఉన్నారు.

# అందని భగీరథ నీరు

- వాగు నీరే దిక్కు
- పట్టించుకోని అధికారులు



రుద్రాపూర్ వాగులో నీటిని తోడుతున్న మహిళలు

**చింతలమానెపల్లి:** మండలంలో గ్రామీణ ప్రజలకు తాగునీటి ఇబ్బందులు తప్పడం లేదు. మిషన్ భగీరథ పథకం ఉన్నా.. ప్రజలకు తాగునీరు అందడం లేదు. మండలంలోని రుద్రాపూర్ గ్రామంలో మిషన్ భగీరథ కోసం ట్యాంకులు నిర్మించారు. గత ఏడాది అదనంగా రూ. 10 లక్షల నిధులు కేటాయించారు. అయినా.. భగీరథ నీరు మాత్రం ఇళ్లకు చేరడం లేదు. ప్రధాన రహదారిపై ఉన్న ఇళ్లకు కొద్ది మొత్తంలో నీరు సరఫరా అవుతుండగా మరికొన్ని కాలనీలకు రెండు లేదా మూడు బిందెల నీరు మాత్రమే సరఫరా అవుతోంది. కొద్ది ఎత్తుగా ఉన్న బొగడగూడ సగం గ్రామానికి మాత్రం నీరు సరఫరా కావడం లేదు. దీంతో గ్రామస్తులకు సమీపంలోని వాగునీరే తాగునీరవుతోంది. మరోవైపు ఇంకా భగీరథ పథకానికి మరమ్మతులే నిర్వహిస్తున్నారు. మండల అధికారుల నిర్లక్ష్యంతోనే నిధులు దుర్వినియోగం అవుతున్నాయని భగీరథ నీరందడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. అధికారులు స్పందించి తాగునీరు అందించాలని కోరుతున్నారు.



నీటిని తీసుకెళ్తున్న మహిళలు



హేటిగూడలో పైపులైనుకు మరమ్మతులు

# ‘మళ్లీ వచ్చేది బీఆర్‌ఎస్ ప్రభుత్వమే’



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

**రెబ్బెన:** కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో ఏర్పడిన వ్యతిరేకతతో రాష్ట్రంలో మళ్లీ బీఆర్‌ఎస్ ప్రభుత్వమే రానుందని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు పోటు శ్రీధర్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌస్ ఆవరణలో గురువారం చలో వరంగల్ బీఆర్‌ఎస్ రజతోత్సవ బహిరంగ సభ పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ మోసపూరిత హామీలతో ఎన్నికల్లో గెలిచిందని, ప్రజలకు ఇచ్చిన హామీలను అమలుచేయకుండా ప్రజలను మోసం చేస్తోందని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై రైతులు, ఉద్యోగులు, నిరుద్యోగులు, కార్మిక కర్షకులు వ్యతిరేకతతో ఉన్నారని అన్నారు. రైతులు పెట్టుబడి సాయం కోసం ఎదురుచూడాల్సిన దుస్థితి నెలకొందన్నారు. ఈనెల 27 నిర్వహించబోయే రజతోత్సవ బహిరంగ సభకు నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు. కార్యక్రమంలో పీఏసీ ఎస్ చైర్మన్ సంజీవ్‌కుమార్, వైస్ చైర్మన్ మహేశ్‌గౌడ్, మాజీ జెడ్పీటీసీ బాబురావు, మాజీ వైస్ ఎంపీపీ సత్యనారాయణ, మాజీ ఎంపీటీసీ శ్రీనివాస్, మాజీ సర్పంచులు మల్లేష్, భీమేష్, తోట లక్ష్మణ్, అహల్యాదేవి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

# దరఖాస్తులు పరిశీలించండి

**కెరమెరి:** రాజీవ్ యువవికాసం కోసం వచ్చిన దరఖాస్తులను మే 15 లోపు పరిశీలించాలని జిల్లా పరిషత్ సీఈవో లక్ష్మీనారాయణ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడారు. ఎస్సీలు, 209 మంది, ఎస్టీ 708, బీసీ 690, మైనార్టీలు 219 మంది రుణాల కోసం దరఖాస్తులు చేశారు. మండలానికి 398 యూనిట్లు మంజూరైనట్లు, ఆన్‌లైన్ చేసిన వారిలో చాలా మంది హార్డ్ కాపీలు కార్యాలయంలో సమర్పించ లేదన్నారు. అర్హులైన వారికి నిబంధల ప్రకారం రుణాలు మంజూరు అవుతాయన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో అంజద్‌పాషా, బ్యాంకు మేనేజర్ శ్రీపాద్, ఐకేపీ ఏపీఎం జగదీశ్వర్, ఈజీఎస్ ఏపీవో మల్లయ్య పాల్గొన్నారు.



మాట్లాడుతున్న లక్ష్మీనారాయణ

# ఇందిరమ్మ కమిటీ సభ్యుల సమావేశం రసాభాస

**చింతలమానెపల్లి:** మండలంలోని బాలాజీ అనుకోడ రైతువేదికలో గురువారం నిర్వహించిన ఇందిరమ్మ కమిటీ సభ్యుల సమావేశం రసాభాసగా మారింది. కమిటీ సభ్యుల ఎంపిక సమావేశం అయినా కమిటీ సభ్యులకు అవగాహన సదస్సుగా ఎంపీడీవో సుధాకర్ రెడ్డి ప్రకటించడంతో సమావేశానికి హాజరైన పలు గ్రామాల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎంపీడీవో కమిటీ సభ్యుల జాబితాను ప్రకటించడంతో ఇందిరమ్మ కమిటీ సభ్యుల ఎంపికలో అధికారులు ఇష్టారాజ్యంగా వ్యవహరించారని ఆరోపించారు. నిబంధనలకు అనుగుణంగా గతంలో కమిటీ సభ్యుల జాబితాను అందించామని కాని దీనికి విరుద్ధంగా కమిటీ సభ్యులను ఎంపిక చేశారని మండిపడ్డారు. అక్రమాలకు పాల్పడే వారిని అనర్హులను ఎంపిక చేయడం వల్ల ప్రభుత్వ లక్ష్యాలు కుంటుపడతాయని డబ్బా గ్రామానికి చెందిన నాయకుడు జుమిడి సాగర్ ఆరోపించారు. నిబంధనలకు వ్యతిరేకంగా కమిటీ సభ్యులను ఎంపిక చేసిన అధికారుల తీరుపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని ఆయన తెలిపారు.

# ఉగ్రమూకలను ఉరితీయాలి



కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు



కౌటాలలో..

**కెరమెరి:** జమ్మూకశ్మీర్‌లోని ఉగ్రవాదులను ఉరితీయాలని వివిధ సంఘాలు, పార్టీల నేతలు, యువజన సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం రాత్రి మండల కేంద్రంలోని సేవాలాల్ మహరాజ్ విగ్రహం వద్ద నుంచి బస్టాండ్ వరకు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. పాకిస్తాన్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ధీటుగా జవాబు చెప్పాలని, మరోసారి భారత్‌పై కన్నెత్తి చూడకుండా చేయాలన్నారు. మాజీ ఎంపీపీ అబ్దుల్‌కలాం, కోవ విజయ్, వెంకట్, రమేశ్, శ్రీనివాస్, వినేష్, వెంకటేశ్, గోపాల్, దినేశ్, తుకారాం పాల్గొన్నారు.

**కౌటాల:** అమాయక ప్రజలను చంపిన ఉగ్రవాదులను అంతమొందించాలని బీజేపీ మండల అధ్యక్షుడు కుంచాల విజయ్ అన్నారు. ఉగ్రదాడిలో మృతి చెందిన వారికి శ్రద్ధాంజలి ఘటిస్తూ బుధవారం రాత్రి కౌటాల ఆర్టీసీ బస్టాండ్, తలోడి చౌరస్తాలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. పర్యాటకులపై దాడి హేయ్యమన చర్య అన్నారు. హిందువులపై దాడులు చేస్తే సహించేది లేదన్నారు. నాయకులు బండి రాజేందర్‌గౌడ్, వొజ్జల వెంకన్న, రవి, సంతోష్, సాయి, వెంకటేశ్, తిరుపతి పాల్గొన్నారు.

# ఆగి ఉన్న ట్రాలీని ఢీకొట్టిన బైక్

- బాలుడికి తీవ్ర గాయాలు



గాయపడిన అక్షయ్

**రెబ్బెన:** మండలంలోని పుంజుమేరగూడ బస్టాండ్ సమీపంలో రోడ్డు పక్కన ఆగి ఉన్న ట్రాలీ ఆటోను వెనుక నుంచి బైక్ ఢీకొట్టిన సంఘటనలో బాలుడికి తీవ్ర గాయాలయ్యాయి. రెబ్బెన ఎస్సై చంద్రశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం.. రెబ్బెన మండల కేంద్రానికి చెందిన లక్ష్మీనారాయణ గౌడ్ అనే డ్రైవర్ తన ట్రాలీ ఆటోను పుంజుమేరగూడ బస్టాండ్‌కు సమీపంలో జాతీయ రహదారి పక్కన నిలిపి భోజనం చేసేందుకు ఇంటికి వెళ్లాడు. ఇందిరానగర్‌కు చెందిన బట్టమేకల రవీందర్ తన కుమారుడు అక్షయ్‌ను తీసుకుని బైక్‌పై మండల కేంద్రానికి వెళ్లాడు. సరుకులు కొనుక్కుని తిరిగి ఇంటికి బయలుదేరాడు. ఈ క్రమంలో మార్గమధ్యలో రోడ్డు పక్కన ఉన్న ట్రాలీఆటోను వెనుక నుంచి ఢీకొట్టాడు. అక్షయ్ తలకు తీవ్రగాయాలు కాగా రవీందర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. వెంటనే 108 అక్షయ్‌ను బెల్లంపల్లికి అక్కడి నుంచి మంచిర్యాలకు తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కరీంనగర్‌కు తీసుకెళ్లారు. స్వల్పంగా గాయపడిన రవీందర్‌కు మంచిర్యాలలో చికిత్స అందిస్తున్నారు. ట్రాలీ ఆటో డ్రైవర్ లక్ష్మీనారాయణ గౌడ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

# వీధికుక్కల దాడిలో మేకలు మృతి



పరిశీలిస్తున్న పశు వైద్యసిబ్బంది

**రెబ్బెన:** మండలంలోని గోలేటి విలేజ్‌కు చెందిన గుగులోత్ కేడీబాయికి చెందిన నాలుగు మేకలు వీధికుక్కలు దాడిలో మృత్యువాత పడ్డాయి. బాధితురాలి కథనం ప్రకారం.. రోజు మాదిరిగానే కాపరి మేకల మందను బుధవారం మేత కోసం గ్రామ శివారులోని రిజర్వాయర్ వైపు తీసుకెళ్లాడు. సాయంత్రం గ్రామంలోని మిగిలిన వారి మేకలు ఇంటికి చేరుకోగా.. కేడీబాయి మేకలు ఇంటికి రాలేదు. గ్రామంలో వెతికినా ఆచూకీ లభించలేదు. గురువారం మేకలను మేతకోసం తిప్పిన ప్రదేశానికి వెళ్లి చూడగా నాలుగు మేకల కళేబరాలు కనిపించాయి. పశు వైద్యసిబ్బందికి సమాచారం అందించడంతో వారు సంఘటన స్థలికి చేరుకున్నారు. వీధి కుక్కలు దాడి చేయడంతోనే తీవ్ర గాయాలతో మేకలు మృతి చెందినట్లు పశు వైద్యసిబ్బంది నిర్ధారించారు. మృతి చెందిన మేకల విలువ సుమారు రూ.35వేల వరకు ఉంటుందని ప్రభుత్వం పరిహారం అందించి ఆదుకోవాలని బాధితురాలు కోరారు.

# గంజాయి కేసులో నలుగురికి జైలు

**కెరమెరి:** గంజాయి కేసులో నలుగురికి జైలుశిక్షతో పాటు జరిమానా విధిస్తూ బుధవారం ఆసిఫాబాద్ ప్రధాన న్యాయమూర్తి ఎంవీ రమేశ్ తీర్పు ఇచ్చినట్లు ఎస్సై ఎస్.మధుకర్ తెలి పారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. 31, మే 2021లో కారులో గంజాయితో పుస్నక రవీందర్, గుర్నూలే శ్రీరాంలు పోలీసులకు పట్టుబడ్డారు. సావర్‌ఖెడా గ్రామానికి చెందిన ఆదే తుకారాం వద్ద కొనుగోలు చేసినట్లు గుర్తించారు. సావర్‌ఖెడా గ్రామంలో తనిఖీలు చేయగా తుకారాం ఇంటివద్ద 47 కేజీలు, భిక్కు ఇంటివద్ద 4 కేజీలు గంజాయి లభ్యమైంది. అప్పటి ఎస్సై రమేశ్ కేసు నమోదు చేశారు. ప్రస్తుత సీఐ సత్యనారాయణ, ఎస్సై మధుకర్‌లు సాక్షులను కోర్టులో హాజరుపర్చగా నేరం రుజువు కావడంతో రవీందర్‌కు ఏడాది జైలు శిక్ష, రూ.20 వేలు జరిమానా, శ్రీరామ్‌కు ఏడాది జైలుశిక్ష, రూ.20 వేలు జరిమానా, తుకారాంకు 10సంవత్సరాలు జైలుశిక్ష, రూ. 2 లక్షలు జరిమానా, భిక్కుకు 5సంవత్సరాల జైలు శిక్ష, రూ.2 లక్షల జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు ఇచ్చినట్లు ఎస్సై మధుకర్ తెలిపారు.

### ఆటో డ్రైవర్‌పై కేసు

**ఆదిలాబాద్‌టౌన్:** ఆదిలాబాద్ పట్టణంలోని సాత్నాల బస్టాండ్ వద్ద గురువారం ట్రాఫిక్ పోలీసులు డ్రంకెన్‌డ్రైవ్ నిర్వహించారు. పట్టణంలోని అంబేద్కర్‌నగర్‌కు చెందిన పవార్ సిద్ధార్థకు డ్రంకెన్‌డ్రైవ్ టెస్టు చేయగా పాజిటివ్ వచ్చింది. ట్రాఫిక్ పోలీసులు ఆటోను పక్కన పెట్టి ఎవరినైన సహాయకులను తీసుకువచ్చి ఆటోను తీసుకెళ్లాలని సూచించారు. కాగా సదరు ఆటో డ్రైవర్ ఒంటిపై డిజిల్ పోసుకుని ఆత్మహత్య చేసుకుంటానని బెదిరింపులకు పాల్పడ్డాడు. పోలీసులతో వాగ్వాదానికి దిగారు. ఆయనపై వన్ టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ట్రాఫిక్ పోలీసులు ఫిర్యాదు చేయగా ఆత్మహత్య కేసుతో పాటు డ్రంకెన్‌డ్రైవ్ కేసు నమోదు చేసినట్లు వన్‌టౌన్ సీఐ సునీల్ కుమార్ తెలిపారు.

### ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులు

**ఆదిలాబాద్‌రూరల్:** రోజుల కిందట విడుదలైన ఇంటర్మీడియట్ ఫలితాలలో తెలంగాణ మైనారిటీ రెసిడెన్షియల్ కాలేజ్ ఆదిలాబాద్ విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబర్చారు. ద్వితీయ సంవత్సరం ఎంపీసీ విభాగంలో అశ్విన్ 964 మార్కులు, ద్వితీయ సంవత్సరం బైపీసీలో ప్రకాశ్ 968 మార్కులు సాధించారు. ఎంపీసీ ప్రథమ సంవత్సరంలో కళ్యాణ్ 470 మార్కులకు 453, బైపీసీలో ప్రకాష్ 440కు 417 మార్కులు సాధించారు. పాఠశాల స్థాయి నుంచి చదువులో రాణిస్తున్న ఈ విద్యార్థులు కళాశాల స్థాయిలోను ఉన్నత మార్కులు సాధించారని కళాశాల ప్రిన్సిపాల్ విజయానంద్ కాంబ్లే తెలిపారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు కళాశాల ప్రిన్సిపాల్‌తో పాటు అధ్యాపకులు అభినందించారు.

# ఘనంగా విగ్రహ ప్రతిష్ఠాపన



పూజలు చేస్తున్న జోగు రామన్న

**ఆదిలాబాద్‌టౌన్(జైనథ్):** జైనథ్ మండలంలోని ఖాప్రి గ్రామంలోని నూతన మహంకాళి ఆలయంలో గురువారం విగ్రహ ప్రతిష్ఠాపన చేపట్టారు. ఈ సందర్భంగా గణపతిపూజ, యజ్ఞం, నిత్య అగ్నిహోత్రం, కలశ స్థాపన, యంత్ర స్థాపన, మూర్తి స్థాపన నిర్వహించారు. గ్రామంతో పాటు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు హాజరై పూజలు చేశారు. ఆలయంలో అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. గురువారం నిత్య అగ్నిహోత్రం, కలశ స్థాపన, యంత్ర స్థాపన, మూర్తి స్థాపన తదితర కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు పేర్కొన్నారు. బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి జోగు రామన్న ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. తమ ప్రభుత్వ హయాంలో రూ.12లక్షలతో ఆలయాన్ని నిర్మించడం జరిగిందని తెలిపారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మెట్టు ప్రహ్లాద్, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.



యజ్ఞంలో పాల్గొన్న భక్తులు

# గంజాయి సేవించిన ముగ్గురిపై కేసు

**ఆదిలాబాద్‌టౌన్:** ఆదిలాబాద్ పట్టణంలోని ఎరోడ్రమ్‌లో గంజాయి సేవిస్తున్న ముగ్గురు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు వన్ టౌన్ సీఐ సునీల్ కుమార్ తెలిపారు. ఆదిలాబాద్ రూరల్ మండలంలోని అంకాపూర్‌కు చెందిన ఉయిక దేవురావు, దస్నాపూర్‌కు చెందిన ముండే ఉత్తం, ఫిల్టర్‌బెడ్‌కు చెందిన కోడే శివాజీలు గంజాయి సేవిస్తుండగా పట్టుబడ్డారు. వీరికి గంజాయి పరీక్షలు చేయగా పాజిటివ్ వచ్చింది. దీంతో వారిపై కేసు నమోదు చేసినట్లుగా సీఐ పేర్కొన్నారు.

# పని కల్పించాలని ధర్నా

**బోథ్:** మండలంలోని ధన్నూర్(బి) గ్రామానికి చెందిన పలువురు కూలీలు గురువారం గ్రామం వద్ద గల ప్రధాన రహదారిపై బైఠాయించి ఆందోళన చేపట్టారు. ధన్నూర్ గ్రామంలో చేపడుతున్న జొన్న కొనుగోళ్లలో హమాలీ పని చేసేందుకు తమకు అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. బీహార్ రాష్ట్రానికి చెందిన కూలీలకు అవకాశం కల్పిస్తున్నారని ఆరోపించారు. ధర్నాకు దిగడంతో రోడ్డుకు ఇరువైపులా వాహనాలు నిలిచిపోయాయి. విషయం తెలుసుకున్న ఎస్సై ప్రవీణ్ కుమార్, మార్కెట్ కమిటీ చైర్మన్ బొడ్డు గంగారెడ్డిలు సంఘటన స్థలానికి చేరుకుని ఆందోళన చేస్తున్న కూలీలతో మాట్లాడారు. పని చేసేందుకు అవకాశం కల్పిస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళనకు విరమించారు.



ఆందోళన నిర్వహిస్తున్న కూలీలు

### పశువులకు గాలికుంటు నివారణ టీకాలు



పశువుకు టీకా వేస్తున్న సిబ్బంది

**ఇచ్చోడ:** మండలంలోని ఇచ్చోడతండా, గుబ్బ గ్రామాల్లో గురువారం పశువైద్య శాఖ సిబ్బంది ఆధ్వర్యంలో పశువులకు ఉచిత గాలికుంటు నివారణ టీకాలు వేశారు. పశువైద్యశాఖ అందచేస్తున్న ఉచిత సామూహిక గాలికుంటు నివారణ టీకాలను సద్వినియోగం చేసుకోవాలని పశువైద్యశాఖ చంద్రశేఖర్ రావు కోరారు.